గోషామహల్ అభివృద్ధికి నిరంతర కృషి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శశికళ కృష్ణ

జియాగూడ: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. మంగళ్‌హాట్‌లో పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ శశికళ కృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనుల నిర్మాణాలను ఆధునీకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ కృష్ణ, బీజేపీ నాయకులు రఘునందన్ యాదవ్ ఎం.కృష్ణ, నరహరి, బబ్లు, జేడి.నితిన్, రవీందర్ గుప్తా, సురేష్, శేఖర్, మల్లేష్, ఆర్.రమేష్, రామకృష్ణ, శేఖర్‌రెడ్డి, జయసింగ్, విక్రమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం



ప్రజా విజయోత్సవ సంబరాల్లో చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల సంక్షేమం కొనసాగుతుందని రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నియంత పాలన నుంచి ప్రజా పాలన వచ్చి ఒక్క సంవత్సరం గడిచిందన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచిపెట్టి పెద్ద ఎత్తున టపాకాయాలు కాల్చి ప్రజా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ.. నిరుద్యోగులను, అమరవీరుల కుటుంబాలను, ప్రజా సంఘాలను అక్కున చేర్చుకున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి, ప్రగతికి సీఎం రేవంత్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.

'ఒక చిత్రం ఎన్నో భావాలను పలికిస్తుంది'



చిత్రకళా ప్రదర్శన ప్రారంభోత్సవంలో బీఎస్.రాములు తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఒక చిత్రం ఎన్నో భావాలను పలికిస్తుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పీకాసో ద స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనను మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిత్రకారుడు గీసిన పెయింటింగ్ అర్థం చేసుకోవాలంటే ఎంతో మంచి మనస్సు ఉండాలన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించి మారిషస్‌లో ఉంటూ తన కళను మరిచిపోకుండా తిరిగి హైదరాబాద్‌లో ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ చిత్రకళా ప్రదర్శన ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు భైరు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, చిత్రకారులు ఉమామహేశ్వరీ దీపా బహదూర్, పి.మహేష్ పాల్గొన్నారు.

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎంపికైన యువకుడికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రెయిన్‌బజార్ ముర్తుజానగర్‌లోని అశ్రఫుల్ మదరిస్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన జాబ్ మేళాను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. నగరంలో పలు కంపెనీలకు చెందిన నిర్వాహకులు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఎంపికైన వారికి ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్, మజ్లిస్ పార్టీ నాయకులు మహ్మద్ వసీముద్దీన్, ఏరియా కమిటీ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సన్మానం



దివ్యాంగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: దివ్యాంగులను సానుభూతితో కాకుండా తోటి మానవులుగా గౌరవించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం నానల్‌నగర్ డివిజన్ ఎస్‌ఎస్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో వరల్డ్ డిజెబుల్డ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల నుంచి వచ్చిన దివ్యాంగులను సన్మానించారు. బల్దియా యూసీడీ విభాగం నుంచి వారికి కేటాయించిన ట్రై సైకిల్స్, ఇతర దివ్యాంగుల సహాయ పరికరాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం ఎక్కువ అని తాము అనుకున్నది వారు సాధించే వరకు విశ్రమించరన్నారు. బల్దియా యూసీడీ విభాగం వారు దివ్యాంగులను ప్రత్యేకంగా గుర్తించి వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్, బల్దియా యూసీడీ విభాగం అధికారిణి లలితకుమారి, అబిబ్‌చౌస్ తదితరులున్నారు.

టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలకు సన్నాహాలు



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్‌.ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 11వ క్రీడా పోటీలకు భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నట్లు టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. మంగళవారం సంఘం కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వివిధ అంశాలపై, 10న ప్రారంభమయ్యే క్రీడలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..గగన్‌మహల్ మైదానంలో 10న నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి క్రీడా పోటీలను ప్రారంభిస్తారన్నారు. పురుషుల కోసం క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, షార్ట్‌పుట్ క్రీడలు, మహిళల కోసం క్యారమ్స్, రంగోలి, సింగింగ్, చెస్, లెమన్ స్పూన్, టాగ్ ఆఫ్ వార్ లాంటి పలు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఇతర నాయకులు బాల్‌రాజ్, విక్రమ్‌కుమార్, ఉమర్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్‌కుమార్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రీ, గీతా సింగ్, శ్రీధర్ నాయకుడు, ప్రభాకర్, జహంగీర్ అలీ, మహ్మద్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

జియాగూడ: ద్విచక్ర వాహనాలను దొంగిలించి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం ఇన్‌స్పెక్టర్ మహేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి.మహేందర్, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.రాజులు తెలిపిన వివరాల ప్రకారం ..ముషీరాబాద్ బోలక్‌పూర్, గుల్షన్‌నగర్ ప్రాంతానికి చెందిన మొహ్మద్ కరీం (19), మొహమ్మద్ ఖాజా, సర్వర్ మియా(19) ముగ్గురు స్క్రాప్ దుకాణంలో పనిచేసేవారు. వ్యసనాలకు బానిసలై డబ్బుల కోసం అప్పర్ ధూల్‌పేట మగ్ర, ఆంధ్ర కాలనీలో బైక్ దొంగతనం చేసి దాన్ని విడిభాగాలు చేసి పని చేస్తున్న స్క్రాప్‌లో విక్రయించారు. మంగళవారం ఉదయం మంగళ్‌హాట్ పోలీసులు బోయిగూడ కమాన్ వద్ద అనుమానం వచ్చిన నిందితులను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించి 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీస్ సిబ్బంది నృపేందర్, సతీష్ తదితరులు ఉన్నారు.

అక్రమ పార్కింగ్‌లతో పరేషాన్

- ఫలితం ఇవ్వని స్పెషల్ డ్రైవ్‌లు
- నగర కొత్వాల్ ఆధ్వర్యంలో జరిగిన రోప్ కార్యక్రమం నీరుగారిన వైనం
- ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు



టోలిచౌకీ వద్ద ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్



బృందావన్ కాలనీ వద్ద మెయిన్ రోడ్డుపై అక్రమ పార్కింగ్

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లకు అడ్డూ అదుపు లేకుండాపోతుంది. బల్దియా, ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న చర్యలు తూతూమంత్రంగా ఉంటున్నాయి. షేక్‌పేట్ డిమార్ట్ నుంచి రేతిబౌలి చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్‌లు రాజకీయ నాయకుల అనుచరుల గుప్పిట్లో ఉన్నాయి. నాయకుల అండదండలతో ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు వెలిశాయి. కొంత కాలంగా తోపుడు బండ్ల స్థానంలో పక్కా డబ్బాలు ఫుట్‌పాత్‌లపై దర్శనం ఇస్తున్నాయి. ఈ డబ్బాల్లో టిఫిన్‌లతో పాటు బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్ లాంటివి కూడా అమ్ముకుంటున్నారు. రెస్టారెంట్లు, మాల్స్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌లు, రోడ్లు అక్రమ పార్కింగ్‌లకు నిలయంగా మారాయి. రేతిబౌలి సమీపంలో ఉన్న షాగౌస్ రెస్టారెంట్ ముందు రోడ్డు ఉదయం 9 నుంచి అర్ధరాత్రి వరకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లతో నిండి ఉంటుంది. అత్యంత రద్దీగా ఉండే ఈ రోడ్డుపై అక్రమ పార్కింగ్‌లతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడడం పరిపాటిగా మారింది.

బడాబాబుల అండదండలతో..

సాలర్‌జంగ్ కాలనీ వద్ద ఉన్న ఫుట్‌పాత్‌లు భవన నిర్మాణ సామగ్రి అమ్మే వ్యక్తుల చేతుల్లో బందీఅయిపోయింది. వీరికి స్థానికంగా ఉండే బడాబాబుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని పలువురు అంటున్నారు. అదే విధంగా టోలిచౌకి చౌరస్తా వద్ద ఉన్న రుమాన్ హోటల్ రోడ్డు మొత్తం అక్రమ పార్కింగ్‌లతో నిండి ఉంటుంది. గచ్చిబౌలి నుంచి టోలిచౌకి ఫ్లై ఓవర్ నుంచి మెహిదీపట్నం వెళ్లే వాహనాదారులు ఇక్కడ రుమాన్ హోటల్ ముందు అక్రమ పార్కింగ్‌లతో పరేషాన్ అవుతున్నారు.

ఫుట్‌పాత్‌లపైనే పార్కింగ్..

షేక్‌పేట్ నాలా వద్ద గల ఓ కారు షోరూమ్ యాజమాన్యం తమ సిబ్బంది వాహనాలను ఫుట్‌పాత్‌ల పైనే అక్రమంగా పార్కింగ్ చేయిస్తుంది. అంతటితో ఆగకుండా ఫుట్‌పాత్‌పై మెట్లు వేసి దర్జాగా షోరూమ్ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పిస్తుంది. పాస్‌పోర్టు సేవా కేంద్రం వద్ద సైతం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. షేక్‌పేట్ నాలా డీమార్ట్, కరాచీ బేకరీ తదితర ప్రాంతాల్లో సైతం అక్రమ పార్కింగ్‌లు జోరుగా సాగుతున్నాయి.

నగర కొత్వాల్ స్వయంగా పాల్గొన్నా..

గత వారం నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో పోలీసులు ఎంతో ప్రతిష్టాత్మకంగా షేక్‌పేట్ డీమార్ట్ నుంచి రేతిబౌలి వరకు 'ఆపరేషన్ రోప్'ను ప్రారంభించారు. ఇందులో నగర కొత్వాల్ స్వయంగా పాల్గొని ఫుట్‌పాత్‌ల ఆక్రమణాలను, అక్రమ పార్కింగ్‌లకు అడ్డుకట్ట వేయడంతో పాటు ఫుట్‌పాత్‌లపై ఉన్న స్టాల్స్, తోపుడు బండ్లను తొలగించారు. తొలగించిన మరు నాటి నుంచే షేక్‌పేట్ నాలా చౌరస్తా, టోలిచౌకీ, సాలర్‌జంగ్ కాలనీ, పశ్చిమ మండలం ఆర్‌టీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌లకు తోడుగా ఫుట్‌పాత్‌లపై డబ్బాలు, స్టాల్స్ మళ్లీ వెలిశాయి. ఏదేమైనా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌లపై చేపడుతున్న చర్యలు తూతూ మంత్రంగానే ఉన్నాయని స్పష్టంగా అర్థమవుతుంది.

అనురాగ్ హ్యూమన్ సర్వీసెస్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు



సాక్షి,సిటీబ్యూరో: అనురాగ్ హ్యూమన్ సర్వీసెస్ స్థాపించిన మేధో వికలాంగుల శిక్షణా కేంద్రానికి రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. వికలాంగుల కోసం ఉత్తమ సేవలను అందించినందుకుగాను రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క, అనురాగ్ హ్యూమన్ సర్వీసెస్ గౌరవ కార్యదర్శి శ్రీ తూట మాధవుడుకు ఈ అవార్డును అందజేశారు. మంత్రి సీతక్క నుంచి 2024 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర స్థాయి అవార్డుతో పాటు సైటేషన్ క్యాష్ ప్రైజ్, సర్టిఫికెట్‌ను కూడా ఆయన అందుకున్నారు. 34 ఏళ్లుగా అనురాగ్ హ్యూమన్ సర్వీసెస్ హైదరాబాద్ నగరంతోపాటు చుట్టుపక్కల ఉన్న పట్టణ-మురికివాడలు, గ్రామాల్లో వికలాంగులకు సేవలను అందిస్తోంది.

ప్రత్యేక పూజలు



పూజల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్, ధన్‌రాజ్

అబిడ్స్: తుల్జాభవాని అమ్మవారికి యోగేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ డైరెక్టర్లు సతీష్, ధన్‌రాజ్, గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు సంతోష్‌గుప్తా, వాసు, సుభాష్ పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సమస్యలపై ఆరా



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట డివిజన్‌లో నెలకొన్న సమస్యలను జీహెచ్‌ఎంసీ సర్కిల్-8 ఉప కమిషనర్ వి.సురేందర్ మంగళవారం పరిశీలించారు. చాంద్రాయణగుట్ట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నెలకొన్న అపరిశుభ్రమైన వాతావరణంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్న విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుడు రాజు ముదిరాజ్ ఆయన దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే ఆయన పారిశుధ్య సిబ్బందితో మైదానంలో నెలకొన్న చెత్తా చెదారాలను తొలగింపజేశారు. అనంతరం స్థానికంగా మరమ్మతులకు గురైన రోడ్లను కూడా పరిశీలించారు. నియోజకవర్గంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని ఈ సందర్భంగా డీసీ తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

చాంద్రాయణగుట్ట: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన ఆంటీ జమీల్(29) రెండు నెలల క్రితం బతుకుదెరువు నిమిత్తం పాతబస్తీకి వచ్చాడు. కాగా సోమవారం రాత్రి ఫలక్‌నుమా రైల్వే పట్టాల పక్కన గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచా రం అందుకున్న బండ్లగూడ పోలీసులు అక్కడికి చేరుకొని సోదాలు నిర్వహించారు. అతని వద్ద 950 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నా రు. కాగా నిందితుడు బిహార్‌లోనే రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొను గోలు చేసి.. ఇక్కడ అవసరమైన వారికి ఎక్కువ మొత్తంలో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న దేవసేన

నాంపల్లి: ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'రెన్యువల్ ఎనర్జీ రీసోర్సెస్'అనే అంశంపై రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు నాంపల్లిలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలలో పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన హాజరయ్యారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లింగయ్య, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెంకట నర్సమ్మ, జిల్లా విద్యాశాఖాధికారిణి రోహిణి పాల్గొన్నారు. మొదటి బహుమతి సీహెచ్. వైష్ణవి, మోడల్ స్కూల్ కందుకూరు రంగారెడ్డి జిల్లా, రెండో బహుమతి ఈ.నరేందర్, జడ్పీహెచ్‌ఎస్ కిష్టాపూర్ మంచిర్యాల జిల్లా, మూడో బహుమతి ఉషా అశ్విని, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నారాయణపేట నారాయణ పేట జిల్లా, కన్సోలేషన్ బహుమతులను ఏ.జశ్విత-పెద్దపల్లి, ఆర్. దీప్తి-మేడ్చల్ జిల్లా అందుకున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ముజీబ్ హుస్సేనిని సత్కరిస్తున్న కేఆర్. రాజ్‌కుమార్, భాస్కర్, పలువురు ఉద్యోగులు

అబిడ్స్: ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. విద్యాశాఖ విభాగంలో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. ఉద్యోగులకు పదోన్నతులు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ ఎస్ఎం .ముజీబ్ హుస్సేన్‌ను టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ అధ్యక్షులు కే ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, ఇతర నాయకులు డేవిడ్ ప్రేమ్‌ల ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..ఉద్యోగులకు అండగా ఉండి వారి సంక్షేమానికి, ప్రగతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పదోన్నతులు పొందిన స్వాతి, లావణ్య, రఫీక్, ఇషాఖ్‌ఖాన్, రామేశ్వర్‌లతో పాటు మల్లికార్జున్, అశ్విని, ఖాజా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



మాట్లాడుతున్న యెగ్గె మల్లేశం కురుమ

అఫ్జల్‌గంజ్: కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవం ఈ నెల 14న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం ముస్లిం జంగ్‌పూల్ బ్రిడ్జి వద్ద ఉన్న రాష్ట్ర కురుమ సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి క్యామ మల్లేష్, సంఘం ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. కోకాపేటలో నిర్మించిన కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, ఎం.రంగారెడ్డి, ఆల్ ఇండియా పాల్ మహాసభ అధ్యక్షుడు సైతాన్ సింగ్‌లతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కురుమ ప్రముఖులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కెండ్యాల శ్రీనివాస్, కట్టా మల్లేషం, కొలుపుల నర్సింహ, పుష్పా నాగేష్, కొత్త శివకుమార్, తూంకుంట అరుణ్‌కుమార్, కాలె అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మనిలాల్ షా

యాకుత్‌పురా: స్వాతంత్ర సమరయోధులు, భారత మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జయంతి సందర్భంగా మంగళవారం నగరంలో ఆయన విగ్రహాని కి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

చాదర్‌ఘాట్‌లో..

రాజేంద్ర ప్రసాద్ జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో మంగళవారం చాదర్‌ఘాట్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. న్యాయవాదులు సమీర్ భట్నగర్, సుధీర్ శ్రీవాత్సవ్, ఏక్తా జనశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేష్ యాదవ్, బజరంగ్ ప్రసాద్‌రావు, జగన్ పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో..

అబిడ్స్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి మనిలాల్ షా, ఉపాధ్యక్షుడు కుమార్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కైలాష్, ఆలం భాస్కర్, రాంచందర్ రావు, ఫరీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

గోల్కొండ: ఈ నెల 4న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు మన్నాన్‌ఖాన్ తెలిపారు. టోలిచౌకీ-టూంబ్స్ రోడ్డులోని గోల్డెన్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ జాబ్ మేళా ఉంటుందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారితో పాటు పోస్టు గ్రాడ్యుయేట్, ఇతర సాంకేతిక కోర్సులు చదివిన వారు నేరుగా తమ తమ విద్యా అర్హత సర్టిఫికెట్లతో ఈ మేళాకు రావచ్చునన్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించి నియామక ఉత్తర్వులు ఇస్తారని ఆయన తెలిపారు.

విద్యార్థులకు 'మోటివేషన్' తరగతులు



సాక్షి, సిటీబ్యూరో: జియాగూడలోని భరత్ అభ్యుదయ హైస్కూల్‌లో మంగళవారం 2005 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. తరగతులు నిర్వహించినందకు ప్రధానోపాధ్యాయుడు దేవేందర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హెచ్.నరేష్ (ప్రభుత్వ ఇంజినీర్), బి.గోపాల్ (డీఆర్‌డీఓ సైంటిస్ట్), ముఖేష్ (జూరాల ప్రాజెక్ట్ ఇంజినీర్), బాలకృష్ణ (రైల్వే శాఖ) తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..



ఖాజీపురాలో తవ్వి వదిలేసిన రోడ్డు

శాలిబండ: శాలిబండ డివిజన్ ఖాజీపురాలోని ఘాజిబండకు వెళ్లే ప్రధాన రోడ్డును నెల రోజుల క్రితం తవ్వి వదిలేయడంతో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఘాజిబండకు వెళ్లే ప్రధాన దారి ఇదే కావడంతో ప్రజలు చుట్టూ తిరుగుకుంటూ వెళ్లలేక పడరాని పాట్లు పడుతున్నారు. గుంతలమయంగా మారిన ఈ రోడ్డుతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు


గౌలిపురా: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష పడింది. ఈ ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..డబీర్‌పురాకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ ఇలియాస్ (34) ఇటీవల స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులకు ఆటంకం కలిగించడంతో దురుసుగా ప్రవర్తించాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న మహ్మద్ షరీఫ్‌ను అరెస్ట్ చేసి మంగళవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా పూర్వపరాలను పరిశీలించిన స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డీసీ ఉమాపతిరావు నిందితుడికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్

సుల్తాన్‌బజార్: జీహెచ్‌ఎంసీ సర్కిల్-14లో జవాన్‌లు, ఎస్‌ఎఫ్‌ఏలు పారిశుధ్యం పనులు పరిష్కరించడంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సహా పూర్తిగా విఫలమయ్యారని గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్ మండిపడ్డారు. మంగళవారం గన్‌ఫౌండ్రీలోని కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, జవాన్, ఎస్‌ఎఫ్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని కోఠి, ఇసామియాబజార్, 94 లైన్, కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి బ్యాక్ సైడ్, గన్‌ఫౌండ్రీ తదితర ప్రాంతాల్లో చెత్త ఎత్తివేసే పనులు సరిగా జరగడం లేదన్నారు. ఇంటింటికీ తిరిగి చెత్త తీసుకుళ్లడం లేదని ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆమె హెచ్చరించారు.



నగరంలో హ్యుందయ్ మోటార్స్ ఇండియా కొత్త షోరూంలు ప్రారంభించారు. షేక్‌పేటలో కున్ హ్యుందయ్ షోరూంను కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ ప్రారంభించారు. డీలర్లు, షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో